క్లుప్తంగా

తులసీరావుకు డెయిరీ కార్మికుల నివాళి

అక్కిరెడ్డిపాలెం: విశాఖ డెయిరీ చైర్మన్ దివంగత ఆడారి తులసీరావు వేలాది జీవితాల్లో వెలుగులు నింపారని డెయిరీ వర్గాలు పేర్కొన్నాయి. నాతయ్యపాలెంలోని విశాఖ డెయిరీ వద్ద బుధవారం నిర్వహించిన తులసీరావు సంస్మరణ కార్యక్రమంలో డెయిరీ అధికారులు, కార్మికులు పాల్గొన్నారు. ఆయన చిత్రపటం వద్ద ఘన నివాళులర్పించారు.

కోడి పందాలు నిర్వహిస్తే కఠిన చర్యలు

పరవాడ: గ్రామీణ ప్రాంతాల్లో జరిగే తీర్థ మహోత్సవాల్లో కోడి పందాలు, లాటరీ బళ్లలు, పేకాట, రికార్డింగ్ డ్యాన్స్‌లు వంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సీఐ పి.ఈశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో యువకుడి ఆత్మహత్య

కూర్మన్నపాలెం: ఆర్థిక ఇబ్బందులు తాళలేక వ్యక్తి ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. దువ్వాడ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలివి.. అగనంపూడి ప్రాంతానికి చెందిన నెల్లి తాతారావు(30) ఫార్మా కంపెనీలోని బ్లూటిన్‌లో డెలివరీ బాయ్‌గా పని చేస్తున్నాడు. ఆర్థికపరమైన ఇబ్బందులు ఉండడంతో, బుధవారం అప్పికొండలోని సరుగుడు తోటలో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో, వారు ఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. మృతుని భార్య మౌనిక ఫిర్యాదు మేరకు దువ్వాడ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

బౌద్ధాలయంలో ప్రత్యేక పూజలు


బాంతేజీని సత్కరిస్తున్న బౌద్ధ సమాజ సభ్యులు

కంచరపాలెం: అశోక్‌నగర్‌లోని బౌద్ధాలయంలో ఆంధ్ర బౌద్ధ సమాజ కేంద్రం ప్రధాన కార్యదర్శి కె.రాజుగణేష్ ఆధ్వర్యంలో బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మయన్మార్ నుంచి వచ్చిన బౌద్ధభిక్షువు సమనీరా ఘోషిత బాంతేజీ ముఖ్య అతిథిగా బుద్ధుడికి పూజలు చేసి, బౌద్ధ సూక్తులు వివరించారు. సనాతన ధర్మాన్ని పాటించాలని సూచించారు. ఈ సందర్భంగా బాంతేజీని సమాజ సభ్యులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సిహెచ్.బాబురావు, సూర్యారావు, జి.బాబులు, గౌతమ్, భీమారావు, సునీల్ తదతరులు పాల్గొన్నారు.

మరింత మెరుగ్గా బోధన


అధ్యాపకులనుద్దేశించి ప్రసంగిస్తున్న ఏయూ రిజిస్ట్రార్ కృష్ణమోహన్

ఏయూక్యాంపస్: అధ్యాపకులు 21వ దశాబ్దపు నైపుణ్యాలు, బోధన పద్ధతులపై విస్తృత అవగాహన కలిగి ఉండాలని ఆంధ్రా యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్ సూచించారు. ఏయూ హెచ్‌ఆర్‌డీసీ కేంద్రంలో ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యా మండలి, కామన్వెల్త్ ఎడ్యుకేషనల్ మీడియా సెంటర్ ఫర్ ఏషియా, ఏయూ సంయుక్తంగా బుధవారం నిర్వహించిన ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాంను ఆయన ప్రారంభించి మాట్లాడారు. అధ్యాపకులు నిరంతరం తమ బోధన పద్ధతులను మెరుగుపరచుకోవాల్సిన అవసరాన్ని వివరించారు. నూతన విద్యా విధానంలో వచ్చిన మార్పులను అవగాహన చేసుకుంటూ విద్యార్థులను తీర్చిదిద్దడం లక్ష్యంగా పనిచేయాలని సూచించారు. మాస్టర్ ట్రైనర్ దినకర్‌రెడ్డి, విశిష్ట అతిథి హెచ్‌ఆర్‌డీసీ సెంటర్ సంచాలకుడు ఆచార్య టి.వికృష్ణ, కార్యక్రమ సమన్వయకర్త ఆచార్య ఎస్.ఎ.డి.పాల్ తదితరులు ప్రసంగించారు. కార్యక్రమంలో ఉత్తరాంధ్ర జిల్లాల్లోని వివిధ కళాశాలలకు చెందిన 55 మంది అధ్యాపకులు పాల్గొన్నారు.

గురజాడ కళాక్షేత్రానికి మోక్షం ఎప్పుడు?

- రెండేళ్ల కిందట కోవిడ్ సెంటర్‌గా ఏర్పాటు
- వైరస్ ఉధృతి తగ్గినా ఇంకా కొనసాగింపు
- ఫంక్షన్ల నిర్వహణకు ఉద్యోగుల అవస్థలు
- అందుబాటులోకి తేవాలని వినతులు


గురజాడ కళాక్షేత్రం

ఉక్కునగరం: నగరంలోని పేరెన్నికగన్న ఫంక్షన్ హాల్స్‌లో ఒకటైన ఉక్కునగరం గురజాడ కళాక్షేత్రం అందుబాటులో లేక ఉద్యోగులు ఇబ్బంది పడుతున్నారు. రెండేళ్ల క్రితం అత్యవసర పరిస్థితుల్లో కోవిడ్ సెంటర్‌గా మారిన ఈ భవనం నేటికీ అలానే కొనసాగిస్తుండడంతో ఫంక్షన్ల నిర్వహణ కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి తలెత్తుతోంది.

వేడుక ఏదైనా అందమైన వేదిక

ఆవరణలో అందమైన గార్డెన్.. లోపల బయట రెండు వేల మంది సామర్థ్యంతో ఫంక్షన్లకు ఎంతో అనువుగా ఉండేది గురజాడ కళాక్షేత్రం. స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం అధికారిక కార్యక్రమాలు, కార్మిక సంఘాల సదస్సులు, ఉద్యోగులు, వారి కుటుంబీకుల ఫంక్షన్ల కోసం టౌన్‌షిప్‌లోని సెక్టార్–9లో విశాలంగా సెంట్రలైజ్డ్ ఏసీతో గురజాడ కళాక్షేత్రాన్ని ఏర్పాటు చేశారు. ఉక్కు యాజమాన్యం టౌన్ అడ్మినిస్ట్రేషన్ అధికారి పర్యవేక్షణలో కళాక్షేత్రం నిర్వహిస్తుంటారు. సీనియార్టీ ప్రాతిపదికన ఉద్యోగులకు కళాక్షేత్రాన్ని కేటాయిస్తుంటారు. టౌన్‌షిప్‌లోని గుర్తింపు సంఘాల కమిటీల ఆధ్వర్యంలో అనేక అవకతవకలతో నిర్వహించే ఇతర కళాక్షేత్రాలతో పోలిస్తే, ఈ కళాక్షేత్రం నిర్వహణ అత్యంత పారదర్శకం అని చెప్పడంలో ఎటువంటి అతిశయోక్తి లేదు. గురజాడ కళాక్షేత్రం కేటాయింపులో అవతకవకలు జరిగితే విజిలెన్స్ విచారణ, క్షమశిక్షణ చర్యలు తీసుకున్న ఉదంతాలు కూడా ఉన్నాయి. కేవలం 10 వేల రూపాయలతో అత్యంత ఘనంగా ఫంక్షన్ చేసుకునే సదుపాయం ఉండటంతో ఉద్యోగులు అందులో ఫంక్షన్లు చేసుకోవడానికి ఎక్కువగా ఆసక్తి చూపేవారు.

కరోనా ఎఫెక్ట్

రెండేళ్ల క్రితం కరోనా తీవ్రంగా ఉన్నప్పుడు నగరంలోని అన్ని ఆసుపత్రుల్లో బెడ్‌లు లేని పరిస్థితి అందరికీ తెలిసిందే. అదే పరిస్థితి ఉక్కు జన రల్ ఆస్పత్రిలో కూడా తలెత్తడంతో, అప్పటి జిల్లా కలెక్టర్ సూచనలతో గురజాడ కళాక్షేత్రంలో 200 పడకలతో కోవిడ్ సెంటర్‌గా తయారు చేశారు. అది ఏర్పాటు చేసిన నెల రోజుల్లో కోవిడ్ తగ్గిపోయింది. అయితే అప్పటి నుంచి కళాక్షేత్రం కోవిడ్ సెంటర్‌గానే మిగిలిపోయింది. దీంతో ఉద్యోగులు తమ ఫంక్షన్ల కోసం బయట ప్రాంతాలపై ఆధారపడాల్సి వస్తోంది. దాని వల్ల వారికి ఆర్థికంగా భారంగా మారుతోంది. యాజమాన్యం స్పందించి గురజాడ కళాక్షేత్రంలో కోవిడ్ సెంటర్‌ను తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని ఉద్యోగులు కోరుతున్నారు.

యాజమాన్యం చర్యలు తీసుకోవాలి



ప్రస్తుతం కోవిడ్ పరిస్థితులు అంతగా లేవు. ఉద్యోగులు తమ కుటుంబ శుభకార్యాల కోసం బయట ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోంది. దీంతో ఎన్నో ఇబ్బందులు పడుతున్నారు. యాజమాన్యం గురజాడ కళాక్షేత్రం నుంచి కోవిడ్ సెంటర్‌ను తొలగించి ఉద్యోగులకు కేటాయించేలా చర్యలు తీసుకోవాలి.

–బి.డేవిడ్, ప్రధాన కార్యదర్శి, స్టీల్ డీఐటీయూ

ట్రాఫిక్ పోలీసుల చొరవతో రోడ్లకు మరమ్మతులు


రోడ్ల మరమ్మతుల పనులను పర్యవేక్షిస్తున్న ట్రాఫిక్ ఎస్‌ఐ మహాలక్ష్మి

కూర్మన్నపాలెం: దువ్వాడ పోలీస్‌స్టేషన్ పరిధి అగనంపూడి రహదారిపై ప్రయాణించే వాహనదారుల ఇక్కట్లు తీరాయి. రాసాలమ్మ కాలనీ నుంచి అగనంపూడి వెళ్లే రహదారి కోళ్ల ఫారం సమీపంలో రోడ్డు గుంతలు పడడంతో రాత్రి వేళల్లో ప్రయాణించే వాహనదారులు ఇబ్బంది పడేవారు. విషయం తెలుసుకున్న కూర్మన్నపాలెం ట్రాఫిక్ ఎస్‌ఐ మహాలక్ష్మి చొరవతో అగనంపూడి లారీ ట్రాన్స్‌పోర్ట్ అసోసియేషన్ ప్రతినిధి ఇందుల నర్సింగరావు సహకారంతో మరమ్మతులు చేయించారు. దీంతో వాహనదారులు ఎస్‌ఐ మహాలక్ష్మికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

23న కార్పొరేటర్లతో రౌండ్ టేబుల్ సమావేశం

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఈ నెల 23న జీవీఎంసీ కార్పొరేటర్లతో రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేశామని 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి. గంగారావు తెలిపారు. ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఈ నెల 30న ఉక్కు త్రిష్ణా మైదానంలో నిర్వహించనున్న ప్రజా గర్జన సన్నద్ధత కార్యక్రమంలో భాగంగా వైఎస్సార్ కాంగ్రెస్, టీడీపీ, జనసేన, సీపీఐ, సీపీఎం కార్పొరేటర్లతో గాజువాకలో సమావేశం ఏర్పాటు చేశామని తెలియజేశారు. సమావేశంలో ప్రజా గర్జన విజయవంతానికి తీసుకోవాల్సిన చర్యలు గురించి చర్చించనున్నామని వివరించారు.

ఎన్‌ఎంయూలో చేరికలు


కార్మికులకు కండువాలు కప్పి యూనియన్‌లో ఆహ్వానిస్తున్న నాయకులు

ఉక్కునగరం: ఆర్టీసీ ఎన్‌ఎంయూలో పలువురు కార్మికులు చేరారు. కూర్మన్నపాలెం ఆర్టీసీ స్టీల్ సిటీ డిపోలో బుధవారం ఎన్‌ఎంయూ ప్రాంతీయ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. సమావేశానికి యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై. శ్రీనివాసరావు, రాష్ట్ర అధ్యక్షుడు పి.వి. రమణారెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై ఆర్టీసీ కార్మికుల సమస్యలు, డిమాండ్లు, సదుపాయాలు, సౌకర్యాల గురించి చర్చించారు. ఈ సందర్భంగా ఎంప్లాయీస్ యూనియన్, వైఎస్సార్ పీటీడీలకు చెందిన 25 మంది కార్మికులు ఎన్‌ఎంయూలో చేరారు. వారికి ముఖ్య అతిథులు కండువాలు కప్పి, యూనియన్‌లోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో డిపో అధ్యక్షుడు జి.ఎస్.ఆర్.కృష్ణ, జోనల్ చైర్మన్ ఎం.సూర్యం, జోనల్ కార్యదర్శి ఎం.వి.ఆర్. మూర్తి, జిల్లా కార్యదర్శి పి. శంకరరావు, జిల్లాలోని పలు డిపోలకు చెందిన కమిటీల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్‌కు ఘన నివాళి


అగనంపూడి కూడలిలో ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు

అగనంపూడి/ఉక్కునగరం/పెదగంట్యాడ/ అక్కిరెడ్డిపాలెం: తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు, మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ వర్ధంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో ఆయన విగ్రహాలు, చిత్రపటాల వద్ద పూలమాలలు వేసి నివాళులర్పించారు. 79, 85 వార్డుల్లోని పెదమడక, అగనంపూడి మినీ జగదాంబ, శివాలయం రోడ్డు, పాత అగనంపూడిల్లో ఎన్టీఆర్ విగ్రహాలకు జిల్లా నాయకులు నెల్లి శ్రీనివాసరావు, కర్రి దోశేంద్ర, వంకర రాము తదితరులు పూలమాల వేసి నివాళులర్పించారు. ఉక్కు నగరం ఉక్కు శ్రామిక సంఘం ఆధ్వర్యంలో స్మృత్యంజలి పార్కు వద్ద ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. రాష్ట్ర కనీస వేతనాల బోర్డు మాజీ డైరెక్టర్ బొడ్డు పైడిరాజు తదితరులు పాల్గొన్నారు. సీతానగరం జంక్షన్‌లో ఎన్టీఆర్ విగ్రహం వద్ద 75వ వార్డు కార్పొరేటర్ పులి లక్ష్మీబాయి తదితరులు, 69వ వార్డు తుంగ్లాంలో ఎన్‌టీఆర్ విగ్రహం వద్ద వార్డు టీడీపీ నాయకులు నివాళులర్పించారు.

వైభవంగా పోలమాంబ పరస మహోత్సవం


పూజలందుకున్న పోలమాంబ అమ్మవారు


మిరుమిట్లు గొలిపే విద్యుత్ కాంతుల్లో కరకచెట్టు పోలమాంబ ఆలయం

ఏయూక్యాంపస్: శ్రీ కరకచెట్టు పోలమాంబ అమ్మవారి వార్షిక పరస మహోత్సవం బుధవారం వైభవంగా జరిగింది. నగరంలోని 14 గ్రామాలకు చెందిన భక్తులు తరలివచ్చి అమ్మవారికి మొక్కులు సమర్పించారు. పెదవాల్తేరు గ్రామ సేవా సంఘం ఆధ్వర్యంలో శ్రీరామ పట్టాభిషేకం, భజనచెట్టును భక్తజన సందోహం ఊరేగింపుగా తీసుకు వచ్చారు. పెదవాల్తేరు నుంచి పోలమాంబ ఆలయానికి వీటిని స్థానికులు ఊరేగింపుగా తోడ్కొని వచ్చారు. వివిధ గ్రామాల నుంచి వచ్చిన భజన బృందాలు, కోలాటం, తప్పెటగుళ్లు, గరిడీలు అమ్మవారి ఆలయం వద్ద పండగ వాతావరణాన్ని తీసుకొచ్చాయి. ఉదయం నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు పోలమాంబను దర్శించుకున్నారు. పంచామృతాభిషేకాలతో వేడుకలను ప్రారంభించారు. అనంతరం మండపంలో ప్రత్యేక కుంకుమ పూజలు జరిపారు. మూడు రోజుల సంక్రాంతి పండగకు కొనసాగింపు అన్నట్లుగా పోలమాంబ పరస మహోత్సవం కన్నుల పండువగా జరిగింది. ఆలయ ప్రాంగణాన్ని పూలమాలలు, విద్యుత్ దీపాలతో సుందరంగా తీర్చిదిద్దారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. పరస సందర్భంగా దేవాలయం నుంచి పెదవాల్తేరుకు వెళ్లే మార్గంలో ఇరువైపులా చెరకు గడలు, చిన్నారుల ఆటవస్తువులు, వివిధ గృహాలంకరణ వస్తువులను చిరు వ్యాపారులు విక్రయించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి డి.వి.ఎస్.సురేష్‌బాబా, ఆలయ చైర్మన్ పి.శంకరరెడ్డి, ధర్మకర్తలు పాల్గొన్నారు. గ్రామ సేవా సంఘం పెద్దలు, 14 గ్రామాల పెద్దలు పాల్గొని అమ్మవారిపై తమ భక్తిప్రపత్తులను చాటుకున్నారు.

విద్యుద్దీపాలు లేక అవస్థలు


అలంకారప్రాయంగా విద్యుత్ స్తంభాలు

గాజువాక: సుందరయ్య కాలనీ దరి దుర్గానగర్ నుంచి సర్దార్ నెస్ట్ వైపునకు వెళ్లే రహదారిలో విద్యుద్దీపాలు వెలగక, ఆ రహదారిలో ప్రయాణించేవారు ఇబ్బంది పడుతున్నారు. ఈ రహదారి విశాఖ స్టీల్‌ప్లాంట్ మెయిన్ గేటుకు అనుసంధానమై ఉండడంతో, భారీ వాహనాల రాకపోకలు ఎక్కువే. ఈ రహదారిలో ఒక గేటెడ్ కమ్యూనిటీ అపార్ట్‌మెంట్స్ సముదాయంలో ఉంటున్న వారితో పాటు చుట్టుపక్కల నివాసముంటున్నవారు కూడా రాకపోకలు సాగిస్తారు. వారిలో పాదచారులు కూడా ఉన్నారు. ఇంతటి ప్రాధాన్యం గల రహదారిలో రాత్రిపూట విద్యుద్దీపాలు పని చేయని పరిస్థితి చోటుచేసుకుంది. సుమారు ఆరు నెలలుగా ఇవి పని చేయడంలేదని స్థానికులు తెలిపారు. ఈ విషయంపై జీవీఎంసీ అధికారులకు ఫిర్యాదు చేసినా, సమస్య పరిష్కారం కాలేదని పేర్కొన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించాలని కోరుతున్నారు.

గెడ్డ పారేదెలా?


గెడ్డలో అడ్డుగా ఉన్న కొట్టిపడేసిన చెట్లు

పెదగంట్యాడ: జీవీఎంసీ 76వ వార్డు పరిధిలో నడుపూరు ప్రధారి రహదారి నుంచి గాంధీనగర్ వెళ్లే గెడ్డ వంతెన వద్ద నరికి పడేసిన చెట్లు ప్రవాహానికి అడ్డంకిగా మారాయి. దీంతో మురుగు నీరు సక్రమంగా ప్రవహించడం లేదు. వర్షాలు పడే సమయంలో గెడ్డ నుంచి ఒక్కసారిగా వరద నీరు రావడంతో గెడ్డ వద్ద నిలిచిపోయి, ఈ నీరు గాంధీనగర్‌లోకి వెళ్లిపోతోంది. అంతేకాకుండా, అందులోని చెత్తాచెదారంతో పాటు విష పురుగులు ఇళ్లలోకి వస్తున్నాయని గాంధీనగర్ వాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడ అడ్డుగా ఉన్న చెత్తను తొలగించాలని జీవీఎంసీ పారిశుధ్య విభాగం అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా, ప్రయోజనం లేకపోతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా స్పందించి గెడ్డకు అడ్డుగా ఉన్న చెత్తను తొలగించాలని కోరుతున్నారు.

విశేషంగా అప్పన్న నిత్య కల్యాణం


అప్పన్న కల్యాణ ఉత్సవమూర్తులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి బుధవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలో స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను వేదికపై అధిష్ఠంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు.

ఘనంగా విష్ణుసహస్రనామ పారాయణ

ఏకాదశిని పురస్కరించుకుని సింహగిరిపై వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో సామూహిక విష్ణుసహస్రనామ పారాయణ బుధవారం ఘనంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలో అర్చకులు, వేద పండితులు స్వామికి పూజలు చేసి హారతులు అందజేశారు. స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్ తదితరులు కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఎంఎస్‌ఎంఈ ఎక్స్‌పో బ్రోచర్ ఆవిష్కరణ


బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న వాసీవా ప్రతినిధులు, ఎంఎస్‌ఎంఈ అధికారులు

అక్కిరెడ్డిపాలెం: ఆటోనగర్ విశాఖ స్మాల్ స్కేల్ ఇండస్ట్రియలిస్ట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (వాసీవా) భవనం వద్ద ఈ నెల 20, 21 తేదీల్లో నిర్వహించనున్న ఎంఎస్‌ఎంఈ ఎక్స్ పో–2023 బ్రోచర్‌ను వాసీవా ప్రతినిధులు, ఎంఎస్‌ఎంఈ అధికారులు, పారిశ్రామిక వేత్తలు బుధవారం ఆవిష్కరించారు. వాసీవా భవనంలో నిర్వహించిన సమావేశంలో అసోసియేషన్ అధ్యక్షుడు ఎ.కె.బాలాజీ మట్లాడుతూ ఎంఎస్‌ఎంఈ, వాసీవా సంయుక్తంగా ఈ ఎక్స్ పోను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎక్స్ పోలో 70 స్టాళ్లను ఏర్పాటు చేయనున్నట్లు కార్యదర్శి డి.వినోద్ తెలిపారు. ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు, ఇంజినీరింగ్ విద్యార్థులకు, ఉపాధి రంగానికి ఎక్స్‌పో ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని ఎంఎస్‌ఎంఈ ఇన్‌చార్జి ఏడీ జి.వి.ఆర్.నాయుడు అన్నారు. కార్యక్రమంలో వాసీవా ఉపాధ్యక్షుడు ఇ.కృష్ణ ప్రసాద్, కోశాధికారి బి.ఎస్.రావు, ఐలా మాజీ చైర్మన్ వై.సాంబశివరావు, పారిశ్రామిక వేత్తలు పాండురంగ ప్రసాద్, కోటేశ్వరరావు, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్‌కు ఆహ్వానం

స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్ (కమర్షియల్) కె.మహంతిని ప్రతినిధులు ఎక్స్‌పోకు ఆహ్వానించారు. వాసీవా అధ్యక్షుడు ఎ.కె.బాలాజీ, ఎంఎస్‌ఎంఈ ఇన్‌చార్జి డైరెక్టర్ జి.వి.ఆర్.నాయుడు, ఐలా ప్రధాన కార్యదర్శి చీకటి సత్యనారాయణ బుధవారం ఆయన చాంబర్‌లో కలిసి ఆహ్వానం పలికారు.

ప్రజాగర్జనతో కేంద్ర ప్రభుత్వానికి గుణపాఠం


దీక్షలో కార్మికులను ఉద్దేశించి మాట్లాడుతున్న పోరాట కమిటీ చైర్మన్ ఆదినారాయణ

కూర్మన్నపాలెం: స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఈ నెల 30న నిర్వహించ తలపెట్టిన ఉక్కు ప్రజాగర్జనతో కేంద్ర ప్రభుత్వానికి గుణపాఠం తప్పదని పోరాట కమిటీ చైర్మన్ ఆదినారాయణ, కన్వీనర్ జె.అయోధ్యరామ్ అన్నారు. ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద చేపడుతున్న రిలే నిరాహార దీక్షలు బుధవారానికి 706వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షల్లో పలువురు ఎంఎంఎస్‌ఎం, ఎస్‌టీఎం విభాగ కార్మికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ విశాఖ ఉక్కును ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని దేశ ప్రజలు, కార్మికవర్గం.. మరీ ముఖ్యంగా సంస్థకు భూములిచ్చిన నిర్వాసితులు గట్టి పట్టుదలతో ఉన్నారన్నారు. కనుక కేంద్ర ప్రభుత్వం పదేపదే చేసే ప్రకటనలతో బెదిరేది లేదన్నారు. అన్ని రాజకీయ పక్షాలతో కలిపి ఈ నెల 30న ఉక్కు నగరంలోని త్రిష్ణ మైదానంలో సాయంత్రం 4 గంటలకు భారీ ఎత్తున ప్రజాగర్జన నిర్వహించనున్నామని, కార్యక్రమానికి రాష్ట్ర, జాతీయ రాజకీయ నేతలను ఆహ్వానిస్తున్నామని తెలియజేశారు. ఉక్కు కార్మికులు, గాజువాక ప్రజానీకం తమ కుటుంబాలతో కలిసి హాజరై, కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డి.దేముడు, జి.ఆనంద్, డి.రమేష్, ఎం.కె.వి.రాజేశ్వరరావు, మోహన్‌కుమార్, ఆర్.సూరిబాబు, ఎస్.వి.నారాయణ, మహ్మద్, పెదిరెడ్ల దేముడు, రమణ, దాసరి శ్రీనివాస్, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

‘ప్రజాగర్జనకు నిర్వాసితులు తరలి రావాలి’


సమావేశంలో మాట్లాడుతున్న రాజశేఖర్

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఈ నెల 30న నిర్వహించనున్న ప్రజా గర్జనకు నిర్వాసిత కాలనీల నుంచి పెద్ద ఎత్తున జనం తరలిరావాలని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ చైర్మన్ మంత్రి రాజశేఖర్ కోరారు. సెంట్రల్ స్టోర్స్ కూడలి వద్ద స్టీల్ ఐఎన్‌టీయూసీ ఆర్గనైజింగ్ ప్రెసిడెంట్ గొందేశి ప్రభాకరరెడ్డి అధ్యక్షతన బుధవారం నిర్వహించిన అఖిలపక్ష కార్మిక సంఘాల సమావేశంలో ఆయన గర్జన ఏర్పాట్లపై చర్చించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్లాంట్ ప్రైవేటీకరణ జరిగితే నిర్వాసితులు పెద్ద ఎత్తున నష్టపోతారన్నారు. దానిని ఆపాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు.

20న పాదయాత్ర

ఈ నెల 20న ఉదయం 6.30 గంటలకు నడుపూరు గాంధీ విగ్రహం వద్ద నుంచి పాదయాత్ర చేయనున్నామని రాజశేఖర్ తెలిపారు. ఇందులో అన్ని కార్మిక సంఘాలు, రాజకీయ పార్టీల నాయకులు పాల్గొంటున్నారన్నారు. కార్యక్రమంలో అఖిలపక్ష నాయకులు నీరుకొండ రామచంద్రరావు, ఎ.మసేనురావు, పి. అప్పలరెడ్డి, డి. అప్పారావు, ఎం. మహాలక్ష్మినాయుడు, మార్టుపూడి పరదేశి, డి.వి. రమణారెడ్డి, బొడ్డు పైడిరాజు, కొవిరి అవతారం, మంత్రి గోపి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాలపై అవగాహన


పాతగాజువాక జంక్షన్‌లో రోడ్డు ప్రమాదాలపై వీడియో చూస్తున్న ప్రజలు

అక్కిరెడ్డిపాలెం: నగరంలో రోడ్డు ప్రమాదాల నివారణకు విశాఖపట్నం సిటీ పోలీసులు వినూత్న ప్రయత్నం చేపట్టారు. దీనిలో భాగంగా రోడ్డు భద్రతపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు దృశ్య, శ్రవణ పరికరాలను ఉపయోగిస్తున్నారు. గాజువాక పోలీస్ స్టేషన్ పరిధి పాతగాజువాక జంక్షన్ ప్రాంతంలో గాజువాక ట్రాఫిక్ సీఐ ఆర్.సత్యనారాయణ రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం ప్రచారం చేపట్టారు. గతంలో నగరంలో జరిగిన రోడ్డు ప్రమాదాలు, పలు చోట్ల సీసీ కెమెరాల్లో రికార్డ్ అయిన ప్రమాద దృశ్యాల వీడియో క్లిప్పింగ్‌లను ప్రదర్శించారు. రోడ్డు ప్రమాదాలలో వాహన చోదకులు చేసిన తప్పిదాలను మైక్ ద్వారా తెలిపారు. ప్రమాదాలు జరగకుండా తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు.

మంచి చిత్రాలకు ప్రోత్సాహం


సినిమా బండి చిత్ర దర్శకుడు ప్రవీణ్ కాండ్రేగులను సత్కరిస్తున్న అతిథులు

సీతంపేట: మంచి చిత్రాలను ప్రేక్షకులు ప్రోత్సహించాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. వైజాగ్ ఫిల్మ్ సొసైటీ ఆధ్వర్యంలో బుధవారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో ప్రవీణ్ కాండ్రేగుల దర్శకత్వంలో రూపొందిన సినిమా బండి చిత్ర ప్రదర్శన, అనంతరం దర్శకుడితో ముఖాముఖి కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా అతిథులుగా హాజరైన పారిశ్రామిక వేత్త భరణికాన రామారావు, సీనియర్ నటుడు ఎస్కే మిశ్రో, వీజేఎఫ్ అధ్యక్షులు గంట్ల శ్రీనుబాబు, నండూరి రామకృష్ణ మాట్లాడుతూ లఘుచిత్ర దర్శకులకు ప్రస్తుతం అనేక అవకాశాలు ఉన్నాయన్నారు. ఉత్సాహం, ఇష్టం, నిరీక్షణ ఉంటే దేనినైనా సాధించవచ్చని నిరూపించిన చిత్రం సినిమా బండి అని పేర్కొన్నారు. చిత్ర దర్శకుడు ప్రవీణ్ కాండ్రేగుల మాట్లాడుతూ తను ఎక్కడా శిక్షణ తీసుకోలేదని, గతంలో లఘుచిత్రాలు నిర్మించానని, తన స్నేహితుల సహకారంతో రూపొందించిన సినిమా బండి చిత్రం గోవా ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో అవార్డు సాధించిందన్నారు. అతిథుల చేతుల మీదుగా ప్రవీణ్‌ను ఘనంగా సత్కరించారు. వైజాగ్ ఫిల్మ్ సొసైటీ కార్యదర్శి నరవ ప్రకాశరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సంయుక్త కార్యదర్శి బి.చిన్నారావు, కార్యవర్గ సభ్యులు ఆర్.శివకుమార్, జి.బాబ్జి, రామచంద్ర ప్రభు, అంజు, పలువురు సినీ ప్రియులు పాల్గొన్నారు.